## క్లుప్తంగా

### 3నుంచి శ్రీచౌడేశ్వరి తిరుణాల


అలంకరణలో శ్రీచౌడేశ్వరీ దేవి

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన శ్రీచౌడేశ్వరి దేవి తిరుణాలను ఫిబ్రవరి 3 నుంచి నిర్వహించేందుకు అటగార దేవాంగ దైవచార సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 3న గుమ్మటోత్సవం, 4న ప్రభోత్సవం, 5నంది ధ్వజావ, 6వ తేదీ సోమవారం అమ్మవారి రథోత్సవం, 7న తిరుగు రథోత్సవం, 8న పార్వేట, 9న వసంతోత్సవం నిర్వహించనున్నారు.

### ముమ్మరంగా పప్పు శనగ కోత


లక్ష్మీపురంలో శనగ పంట కోస్తున్న వ్యవసాయ కూలీలు

కల్లూరు: మండలంలో పప్పు శనగ కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రబీలో సుమారు 2600 ఎకరాల్లో శనగ పంట వేశారు. ఈసారి వాతావరణం కలిసి రావడంతో ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

### దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


దర్గాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): గార్గేయపురం చెరువు కట్ట వద్ద వెలసిన హజ్రత్ షాహ్ సయ్యద్ షాహ్ వలీల్లాహ్ రహ్మతుల్లా అలైహ్ దర్గాను కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ దర్శించుకున్నారు. ఆదివారం దర్గా ఉరుసు సందర్భంగా చాదర్ సమర్పించి త్యేక ఫాతెహాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దర్గా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అంతకు ముందు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ దర్గాలో పూలు, చాదర్ సమర్పించి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఎస్ మహబూబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం


చిన్నటేకూరు గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ నల్లప్ప

కల్లూరు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప అన్నారు. ఆదివారం రాత్రి పోలీసు స్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు గ్రామాన్ని ఆయన సందర్శించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలు, 100, 112 ఫోన్ నెంబర్ల వినియోగంపై అవగాహన కల్పించారు.

### ఆత్మీయ సమ్మేళనం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. నాడు వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పిలిచి సత్కరించారు. అంతకు ముందు పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

### వక్ఫ్‌బోర్డు సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు జిల్లా వక్ఫ్ బోర్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ మహబూబ్ పీర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు చేపట్టినా స్థానిక అధికారులు పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, వీటిపై ఫిబ్రవరి 3వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలుపనున్నట్లు వెల్లడించారు.

### 1,2 తేదీల్లో నీటి సరఫరా బంద్

కర్నూలు (టౌన్): వచ్చే నెల 1, 2 తేదీలలో కర్నూలు నగరంలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మునగాలపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి ఆశోక్ నగర్‌లో ఉన్న ఫిల్టర్ బెడ్స్‌కు నీటిని సరఫరా చేసే 1200 ఎంఎం డయా పైపు లైన్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల నగర వాసులకు రెండు రోజుల పాటు నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నీటిని పొదుపుగా వాడుకొని నగర ప్రజలు సహకరించాలని కోరారు.

# గడప గడపకు వెళ్లి.. సంక్షేమాన్ని వివరించి

- కల్లూరు అర్బన్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేష స్పందన
- ఇంటింటికీ వెళ్లి చేకూరిన లబ్ధిని వివరించిన ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డు పరిధిలోని ఫరూక్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వార్డు కార్పొరేటర్ సాపురు మాధురి, వార్డు ఇన్‌చార్జ్ సాపురు వీరయ్య ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. అర్హులైన పేదలందరికీ పథకాలను అందజేస్తున్నామన్నారు. పార్టీలకు, రాజకీయాలకు, మతాలకు, వర్గాలకు, కులాలకు అతీతంగా లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. గత టీడీపీ పాలనలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులు ఉండాలన్నారు. ప్రస్తుతం మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా పథకాలు పేదలకు అందుతున్నాయన్నారు. ఇలా పారదర్శక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, ఇప్పల నారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ బాల చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, నాయకులు గోపీనాథ్, ఎం. సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి బ్రోచర్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

### ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి కోరారు. బాల్, పాడ్స్ తదితర పరికరాలపై ముడుచుకుపోయిన కాళ్లకు, చేతులకు ఫిజియోథెరపీ చేస్తారన్నారు. ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు, ప్రత్యేక బధిర బాలలకు ఐఈఆర్‌టీ పరికరాలతో విద్యనందిస్తారని ఆమె ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

### నేటి నుంచి సర్వే

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఈనెల 30, 31వ తేదీల్లో సిటిజన్ అవుట్ రీచ్ సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు.

### అట్టహాసంగా కబడ్డీ పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పొన్నకల్‌లో అయ్యకొండ మిన్నెల్లస్వామి ఉరుసును పురస్కరించుకుని ఆదివారం గ్రామస్తులు ఓపెన్ కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. దీనిని గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గూడూరు పట్టణ కన్వీనర్ అబేలు, మాజీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, హనుమంతరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్ కలాంబాషా, కుమార్, తదితరులు పాల్గొన్నారు.


పొన్నకల్‌లో కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న కోట్ల హర్ష

# రూపుదిద్దుకుంటున్న మహాప్రాకారం


సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం


నిర్మిస్తున్న మహాప్రాకారం

- శరవేగంగా సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు
- దాతల సహకారంతో పలు నిర్మాణాలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. దాతల సహకారంతో దాదాపుగా రూ.2 కోట్లతో పలు పనులు జరుగుతున్నాయి. జిల్లాలో ప్రముఖ ఆలయంగా పేరుగాంచిన ఈ క్షేత్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. దేవదాయశాఖ అధికారులతో పలుమార్లు సమావేశమై భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం భక్తులు బస చేసేందుకు పాత గదుల స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నారు. దర్శన సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూ కాంప్లెక్స్, విశ్రాంతికి ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు ఆలయ చరిత్ర ఉట్టిపడేలా అత్యాధునిక డిజైన్లతో మహాప్రాకారం నిర్మిస్తున్నారు. ఈ కట్టడానికి భారీ బండరాళ్లను వినియోగిస్తున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

### వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కల్లూరు: కల్లూరులో నివాసం ఉంటున్న వృద్ధులు, వితంతువులకు కల్లూరు ఫొటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కల్లూరులోని ఓ విద్యాసంస్థ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

# మానసిక వికాసానికి క్రీడలు అవసరం

కర్నూలు (టౌన్): మానసిక వికాసానికి క్రీడలు అవసరమని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. ఆదివారం స్థానిక ఏ.క్యాంపు అయ్యప్ప స్వామి దేవాలయ సమీపంలో తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. పోటీలను సీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలు ఆత్మరక్షణకు, క్రమశిక్షణకు తోడ్పాటు అందిస్తాయన్నారు. చిన్ననాటి నుంచే క్రీడలను అభ్యసించడం వల్ల భవిష్యత్తులోను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ప్రస్తుత సమాజంలో ఒత్తిడితో కూడిన చదువులు ఉండటం వల్ల ప్రతి విద్యార్థి, విద్యార్థినీ ఏదో ఒక క్రీడను అభ్యసించాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో సర్టిఫికెట్లు ఉంటే త్వరగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులకు సీఈఓ కలర్ బెల్టులు ప్రదానం చేశారు.


మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన చేస్తున్న క్రీడాకారులు

# యువకుడికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకునికి కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు అతి క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి నడిపించారు. వివరాలను ఆదివారం ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ పి.కిరణ్‌కుమార్, డాక్టర్ గణేష్‌రెడ్డి తెలిపారు. వివరాలు వారి మాటల్లోనే 'ఇటీవల షేక్ రఫీక్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పలు ఆసుపత్రులు తిరిగాడు. తీవ్రంగా గాయపడటమే గాక పలుచోట్ల ఎముకలు విరిగిన కారణంగా చికిత్స కోసం కిమ్స్ హాస్పిటల్‌కు వచ్చారు. అతని తుంటి ఎముకలోని బంతిగిన్నె కీలుతో పాటు దానికి ఆధారంగా ఉండే ఎముక కూడా తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించాము. అవి దాదాపుగా ముక్కలు ముక్కలుగా విరిగిపోయాయి. ఇలాంటి పరిస్థితిలో ముందుగా ఆ ఎముకలకు రక్తప్రసారాన్ని కాపాడుతూ సేఫ్ సర్జికల్ డిస్‌లొకేషన్ అనే అరుదైన ప్రక్రియను ఉపయోగించి విరిగిన ఎముకల ముక్కలన్నీ ఒకచోటకు చేర్చి వాటిని పునరుద్ధరించాము. ఏడాదికి పది లక్షల మందిలో ఇద్దరికి మాత్రమే ఇలాంటి సమస్య వస్తుంది. ఇలాంటి కేసులకు అత్యంత జాగ్రత్తలు తీసుకుని శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చింది' అని వారు వివరించారు.


కోలుకున్న రఫీక్‌తో వైద్యుల బృందం

### కొండ దిగిన గోవులు

పాణ్యం: గోవులు కొండ దిగి గ్రాసం కోసం మైదాన ప్రాంతాల దారి పట్టాయి. పాణ్యం మండలంలో సుగాలితండా, పిన్నాపురం, కందికాయపల్లె, కేఆర్‌ఆర్ తండా, బుగ్గాని పల్లె తండాల్లో సుమారు 2 వేలకు పైగా అవులు ఉన్నాయి. వాటి యజమానులు ప్రతి ఏడాది వర్షాకాలంలో సమీపంలోని కొండపైకి తీసుకెళ్తారు. దాదాపు ఎనిమిది నెలల పాటు వాటిని కొండపైనే మేపుకుంటారు. వేసవికాలంలో కొండపై గ్రాసం లభించదు కనుక గోవులు కిందికి దిగుతాయి. అయితే, ఈ సారి కొండప్రాంతాల్లో ఆశించిన మేర వర్షాలు పడకపోవడంతో ఒక నెల ముందుగానే పశువులు కిందికొచ్చాయి. యజమానులు వాటిని చాగలమర్రి, ఆత్మకూరు, వెలుగోడు, మహానంది, ఆళ్లగడ్డ ప్రాంతాల వైపు తీసుకెళ్తున్నారు. జూన్‌లో తొలకరి వర్షాలు ప్రారంభంకాగానే మళ్లీ అక్కడి నుంచి తిరిగి వస్తామని పశుపోషకులు తెలిపారు.


బుగ్గానిపల్లె తండా నుంచి ఆళ్లగడ్డ పరిసర ప్రాంతాల వైపు వెళ్తున్న అవులు

# పార్టీ గెలుపే ధ్యేయం కావాలి

- సత్వరమే గృహ సారథులను ఎంపిక చేయండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే సుధాకర్ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు: రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అస్లామ్ పత్తి మిల్లు కాంపౌండ్‌లో గూడూరు మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న చిన్న విభేదాలు ఉంటే పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ ఏడాదిన్నర కాలం ఎంతో విలువైనదన్నారు. కింది స్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు గృహ సారథులను నియమిస్తున్నట్లు చెప్పారు. నేటి మధ్యాహ్నంలోపు ఎంపిక చేసిన గృహ సారథుల లిస్టు తనకు అప్పగించాలని సచివాలయ కన్వీనర్లకు సూచించారు. గృహ సారథులుగా ఎంపికైన వారికి వచ్చే నెల 1 నుంచి 7 వరకు వారం రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, పట్టణ, రూరల్ సచివాలయ కన్వీనర్లు ఎల్.వెంకటేశ్వర్లు, మహేశ్వరరెడ్డి, వైఎస్సార్సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జె.ఆబేలు, వైస్ ఎంపీపీ కె.నాగులాపురం నరసింహారెడ్డి, చనుగొండ్ల దొల, గుడిపాడు భాస్కరరెడ్డి, మునుగాల రామాంజనేయులు, మున్సిపల్ కౌన్సిలర్లు దస్తగిరి, బజారి, కలామ్, ఖలీల్, కుమార్, కిషోర్, కుమార్, మద్ది, విజయుడు, బండి రాజు, ప్రతాప్, దండు శ్రీను, పెంచికలపాడు మగ్బుల్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

### ఏఐఎస్ఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

కల్లూరు: ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్ కోరారు. ఆదివారం కల్లూరులోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 15,16 తేదీలో నగరంలోని ఎస్టీయూ ఉపాధ్యాయ కార్యాలయంలో సభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు గిరి, పవన్, వంశీ, బాబు, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు స్పందన కార్యక్రమం

సాక్షి నెట్ వర్క్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు, గూడూరు, సి. బెళగల్ రెవెన్యూ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే వినతులు అందజేయవచ్చు నని ఆయా మండలాల రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు.

### ముస్లింలపై వివక్ష తగదు

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై వివక్ష చూపడం తగదని అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్ఏ సుబాన్ పేర్కొన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన అవాజ్ కమిటీ సమావేశంలో ఆయన సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్‌తో కలసి మాట్లాడారు. ముస్లింల మధ్య చీలికలు తెచ్చే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. ముస్లిం విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యేలా స్కాలర్‌షిప్పులను రద్దు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీయువతీ, యువకుల వివాహాలకు ప్రోత్సాహకాలను విడుదల చేయడం లేదని ఆరోపించారు.

### టీచర్లను కించ పరిస్తే సహించం

కర్నూలు కల్చరల్: ఉపాధ్యాయులను కించ పరిస్తే సహించమని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమీక్షా సమావేశాల్లో, పాఠశాలల ఆకస్మిక తనిఖీల సందర్భాల్లో చిన్నచిన్న తప్పులకే కొందరు అధికారులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఇది తగదన్నారు. తప్పు చేసిన వారిని నిబంధనల ప్రకారం వివరణ కోరి చర్యలు తీసుకునే వెసలుబాటు ఉన్నప్పటికి చిన్న చిన్న కారణాలతో టీచర్లను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. పాఠశాలలు ప్రారంభం నుంచే టీచర్లు, బోధనేతర సిబ్బంది కొరత, నాడు నేడు, శిక్షణ తరగతులు, బోధనేతర పనులతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సతమతమవుతున్నా పట్టించుకునే వారు లేరని విమర్శించారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి పాఠశాలల బలోపేతానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కర్నూలు 'క్యాట్'వాక్ అదుర్స్

- అంతర్జాతీయ పిల్లుల ప్రదర్శనలో రెండో బహుమతి

కర్నూలు(రాజ్‌విహార్): అంతర్జాతీయ పిల్లుల ప్రదర్శనలో కర్నూలు పిల్లి చక్కటి ప్రతిభ కనబర్చింది. వరల్డ్ క్యాట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 27, 28వ తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించారు. ఇందులో కర్నూలులోని శ్రీలక్ష్మీ నగర్‌లో నివాసం ఉంటున్న లోధి ఇర్ఫార్ అహ్మద్ ఖాన్ పెంపుడు పిల్లి(సుల్తాన్) రెండో బహుమతి సాధించి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గత కొన్నేళ్లుగా పిల్లులు, ఇతర మూగ జీవాలను పెంచుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నిర్వహించిన పోటీల్లో తన బెంగాల్ జాతి పిల్లి చక్కటి నడక, ప్రదర్శన నిర్వహించడంతో రెండో స్థానంలో నిలిచిందని, దీంతో నిర్వాహకులు మెమొంటో ఇచ్చి సత్కరించినట్లు వెల్లడించారు.



నిర్వాహకుల నుంచి మెమొంటో అందుకుంటున్న లోధి ఇర్ఫార్ అహ్మద్ ఖాన్

# మానవత్వం చాటుకున్న ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పనిచేసే పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పశుసంవర్ధకశాఖ సహాయకుడికి రూ.30 వేలు ఆర్థిక సాయం అందచేశారు. జూపాడుబంగ్లా మండలం తాటిపాడులో పశుసంవర్ధకశాఖ సహాయకుడు కె.వెంకటరమణ ఈ నెల 27న విధులు ముగించుకొని వస్తుండగా నందికొట్కూరు దగ్గర జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు ప్రభుత్వం సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈయనకు మరింత మెరుగైన చికిత్స అందచేసి త్వరగా కోలుకునేందుకు వీలుగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పారా వెట్స్, పశుసంవర్ధక సహాయకులు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... స్పందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవడం మానవత్వానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఏహెచ్ఏ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అన్వర్‌బాష, ఉపాధ్యక్షుడు వై.జనార్దన్‌రెడ్డి, ఇతర నాయకులు బాబురావు, సుధాకర్, పి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న వెంకటరమణకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


ప్రతిభ చాటిన క్రీడాకారులకు కలర్ బెల్టులు ప్రదానం చేస్తున్న కేజే రెడ్డి

కర్నూలు (టౌన్): నేటి సమాజంలో క్రీడలకు, క్రీడాకారులకు ప్రాధాన్యత పెరిగిందని, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రాగమయూరి బిల్డర్స్ అధినేత కేజే రెడ్డి అన్నారు. ఆదివారం ఏ. క్యాంపులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్‌లోని రాయల్ అకాడమీలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు ఆయన కలర్ బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు క్రీడలను సాధన చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను కేవలం చదువులకే పరిమితం చేయకుండా మార్షల్ ఆర్ట్స్ క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, శిక్షకులు ఊర్మిళ, వీరేష్ పాల్గొన్నారు.

# 'మానవతా' సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి

కర్నూలు కల్చరల్: సమాజానికి మానవత స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు చాలా గొప్పవని, సంస్థ ప్రతినిధులు అభినందనీయులని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలను పర్యావరణంలో మొదటి స్థానంలో నిలిపేందుకు డ్వామా ద్వారా వివిధ రకాల మొక్కలు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ఆ మొక్కలను మానవత సంస్థ సహకారంతో నాటేందుకు సహకరిస్తామన్నారు. సంస్థ జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి, కర్నూలు యూనిట్ అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో సంస్థ జిల్లా వ్యాప్తంగా శాఖలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో పదో తరగతి విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాసేందుకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు యుగంధర్‌శెట్టి, రామకృష్ణ, శేషయ్య, హరికృష్ణ, రాజు, నాగరాజు, పరమేశ్వరరెడ్డి, హరికిషన్, రవికుమార్, వెంటకరెడ్డి, శోభన్‌బాబు పాల్గొన్నారు.